నమస్తే తెలంగాణ
# నల్లగొండ
5 | నల్లగొండ, బుధవారం 12 జూన్ 2024 | NALGONDA

## బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కోసం విద్యార్థుల ఎంపిక



విద్యార్థుల ఎంపికకు డ్రా తీస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి రాజ్యలక్ష్మి

నల్లగొండ రూరల్, జూన్ 11: ప్రతిభ కలిగిన నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న బెస్ట్ అవైలబుల్ పథకంలో భాగంగా 1 నుంచి 5 తరగతికి చెందిన విద్యార్థుల ఎంపికను మంగళవారం చేపట్టారు. కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో జిల్లా రెవెన్యూ అధికారి రాజ్యలక్ష్మి డ్రా తీసి బెస్ట్ అవైలబుల్ పథకానికి విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ పథకానికి 134 మంది విద్యార్థులను 1వ తరగతికి, 137 మంది విద్యార్థులను 5వ తరగతికి ఎంపిక చేశారు. దాంతో పాటు మరో 20 మందిని అదనంగా ఎంపిక చేశారు. ఎవరైన సరైన సమయంలో చేరకుంటే అదనంగా ఎంపిక చేసిన 20 మంది నుంచి అవకాశం కల్పిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ అధికారి రాజ్ కుమార్, బీసీ సంక్షేమ అధికారి రమేశ్ ఉన్నారు.

# మోగనున్న బడిగంట

- నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం
- ఇప్పటికే స్కూళ్లకు చేరిన పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,381 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు

**వేసవి సెలవుల తర్వాత తిరిగి బడులు పునః ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 24 నుంచి ఈ నెల 11వరకు తాళాలు వేసి మూగబోయిన బడిగంట నేటి నుంచి మోగనుంది. విద్యార్థులంతా ఇక సెలవులకు టాటా చెప్పి స్కూళ్లకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. పలు సర్కారు పాఠశాలలను ప్రభుత్వం సకల సౌకర్యాలతోపాటు సున్నాలు, రంగులు వేసి తీర్చిదిద్దింది. విద్యార్థులకు ఉచితంగా అందించే పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫామ్స్ ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలకు చేరాయి. మొదటి రోజున పాఠశాలలను మామిడికొమ్మలు, పూలతో అలంకరించి పండుగ వాతావరణంలో పునఃప్రారంభించనున్నారు.** *రామగిరి, జూన్ 11*





ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో 4,381 పాఠశాలున్నాయి. వీటిలో 5లక్షల మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఈ నెల 6నుంచి ఉమ్మడి జిల్లాలోని 3,113 ప్రభుత్వ పాఠశాలల పరిధిలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు ప్రభుత్వ బడి విశిష్టతను తెలుపుతూ అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 19 వరకు కొనసాగనుంది.

### పాఠ్య, నోట్ పుస్తకాలు రెడీ

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠ్యపుస్తక విభాగం నుంచి మండలాల్లోని ఎంఆర్‌సీలకు, అక్కడి నుంచి పాఠశాలలకు చేరవేశారు. 2024-25 విద్యా సంవత్సరం 1 నుంచి 10 వ తరగతి వరకు 5,86,610 పుస్తకాలు అవసరం ఉండగా 5,86,250 పుస్తకాలు వచ్చాయని, 360 పుస్తకాలు పెండింగ్ ఉన్నాయని అధికారులు వెల్లడించారు. 6 నుంచి 12వ తరగతి వరకు సింగిల్ రూల్ నోట్ బుక్స్ 81,815, వైట్ నోట్‌బుక్స్ 4,06,108 అవసరం ఉండగా అన్నీ బుక్ డిపోకు రాగా వాటిని మండలాలకు అక్కడి నుంచి పాఠశాలలకు పంపించారు. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఉచితంగా అందజేసే వర్క్‌బుక్స్ 1,12,000 అవసరంగా అవి జిల్లా బుక్‌డిపోకు రాగా మంగళవారం వరకు 18 మండలాలకు పంపిణీ చేశారు. మరో రెండు రోజుల్లో మిగిలిన మండలాలకు చేరవేయనున్నారు.

విద్యార్థులకు అందజేసే స్కూల్ యూనిఫామ్స్‌ను కూడా సిద్ధం చేస్తున్నారు. ఇవన్నీ బడి ప్రారంభమైన తొలి రోజే ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. యూడైస్‌లో ఎన్‌రోల్ అయిన ప్రతి విద్యార్థికి ఇవి అందనున్నాయి. పండుగ వాతావరణంలో బడులను తెరిచేందుకు కార్యక్రమాలు చేపడుతున్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి



ప్రభుత్వం, విద్యాశాఖ ఆధ్వర్యంలో సూచించిన నిబంధనల ప్రకారం బడిబాటలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి. పండుగ వాతావరణంలో పాఠశాలలను పునఃప్రారంభం చేసి విద్యార్థులను స్వాగతించాలి. బడికి వచ్చిన ప్రతి విద్యార్థికీ ఉచిత పాఠ్య, నోట్స్ పుస్తకాలు, యూనిఫామ్ అందజేయాలి.

*– భిక్షపతి, నల్లగొండ డీఈఓ*

## గౌరవాన్ని కాపాడుతారని ఆశిస్తున్నా..

- నాతో పాటు ఐదుగురు డైరెక్టర్లు హాజరుకాకుంటే అవిశ్వాసం వీగిపోతుంది
- బీఆర్‌ఎస్‌లో నాతోపాటు 9 మంది డైరెక్టర్లు
- నష్టాల్లో ఉన్న బ్యాంకును జాతీయ స్థాయిలో నిలిపా
- మీడియాతో డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

నీలగిరి, జూన్11 : నల్లగొండ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు 19 మంది డైరెక్టర్లలో తనతోపాటు ఉన్న 18 మంది బీఆర్‌ఎస్ డైరెక్టర్ల నుంచి ఎనిమిది మంది డైరెక్టర్లు కాంగ్రెస్‌లో చేరారని, ఇంకా 10 మంది డైరెక్టర్లు బీఆర్‌ఎస్‌లోనే ఉన్నారని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి తెలిపారు. తనపై 14 మంది డైరెక్టర్ల సంతకంతో అవిస్వాసం ఇచ్చినందున తమలో నుంచి ఆరుగురు గైర్హాజరైతే ఈ నెల 20న నిర్వహించే అవిస్వాసం వీగిపోతుందని చెప్పారు. తనతోపాటు మరో 9 మంది డైరెక్టర్లు బీఆర్‌ఎస్‌లోనే ఉన్నామని, వారంతా పార్టీ గౌరవానికి కట్టుబడి తనవెంటే ఉంటారని విశ్వాసం ఉందని ధీమా వ్యక్తం చేశారు.

నల్లగొండలోని డీసీసీబీలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తనపై 14 మంది అవిస్వాస నోటీసును జిల్లా సహకార అధికారికి ఇచ్చిన నేపథ్యంలో ఆయన ఈ విధంగా స్పందించారు. 107 సంవత్సరాల చరిత్ర కలిగిసిన డీసీసీబీని తాను పాలకవర్గం బాధ్యతలను స్వీకరించే సమయానికి రూ.900 వందల కోట్ల టర్నోవర్ నుంచి ప్రస్తుతం రూ. 2,400 కోట్ల టర్నోవర్‌కు తీసుకొచ్చామన్నారు. 11 శాతంగా ఉన్న ఎన్‌పీఏను 1.83 శాతానికి తీసుకొచ్చి రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిపామని తెలిపారు. గత కాంగ్రెస్ పాలకవర్గంలో దేవరకొండ బ్రాంచ్ కుంభకోణం, ఇతర అవినీతి అక్రమాలతో నష్టాల్లో ఉన్న బ్యాంకును తమ పాలకవర్గ సభ్యుల సహకారం, బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది, రైతుల సహకారంతో అభివృద్ధి పథంలో నడిపించామని ఆడిట్ గణాంకాలే చెపుతున్నాయని చెప్పారు. ఎక్కడ కూడా అక్రమాలకు తావివ్వకుండా బదిలీలను నిర్వహించిన ఘనత తమకే దక్కిందన్నారు. బ్యాంకు ప్రఖ్యాతులను జాతీయ స్థాయిలో నిలబెట్టడం, బ్యాంకు చైర్మన్‌గా జాతీయ స్థాయిలో అవార్డును తీసుకోవడం సంతృప్తినిచ్చిందని తెలిపారు. తమ పార్టీ డైరెక్టర్లు గౌరవాన్ని కాపాడే విధంగా తన వెంటే ఉండనున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. డైరెక్టర్లు కలిసి రావాలని కోరారు. ఆయన వెంట డైరెక్టర్లు రంగాచారి, ప్రవీణ్‌రెడ్డి, అప్పిరెడ్డి తదితరులు ఉన్నారు.



విచారణలో పాల్గొన్న డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మాతృ

## ప్రభుత్వ ఆస్పత్రుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు

- నల్లగొండ డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మాతృ

చౌటుప్పల్, జూన్ 11 : ప్రభుత్వ ఆస్పత్రుల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నల్లగొండ డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మాతృ హెచ్చరించారు. మంగళవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో పలు ఫిర్యాదులపై విచారణ చేపట్టారు. రోగుల నుంచి సిబ్బంది అక్రమ వసూళ్లు చేయడం, వైద్యులు ప్రైవేట్ దవాఖానలు కలిగి ఉండటం, విధులకు సరిగా రాకపోవడం, బయోమెట్రిక్ వాడకపోవడం, కాంట్రాక్టర్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వ్యక్తిగత కొట్లాటలు, ఒకరిపై మరొకరి దూషణలతో అత్యవసర సేవలు నిలిపివేసి సిబ్బంది ధర్నాలు చేయడం తదితర అంశాలపై ఆయన సంబంధిత ఉద్యోగులతో మాట్లాడారు. వారి నుంచి వివరాలు సేకరించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్య కమిషనర్ ఆదేశాల మేరకు ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ వైద్యులతోపాటు సిబ్బంది, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను విచారించినట్లు చెప్పారు. నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. తదుపరి ఫలితాల ఆధారంగా చర్యలు ఉంటాయని తెలిపారు.

# లిఫ్ట్ రైతులకు సాగునీరు అందేనా?

- సాగర్ ఆయకట్టులో అధ్వానంగా పంట కాల్వలు
- మరమ్మతులకు నోచుకోని షట్టర్లు
- కాల్వ కట్టలకు ఇరువైపులా కంప చెట్లు



మిర్యాలగూడ మండలం జేత్యాతండా పరిధిలోని ఎల్-16 ఎత్తిపోతల పథకం

మిర్యాలగూడ, జూన్ 11 : నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కింద ఉన్న 41 ఎత్తిపోతల పథకాల పరిధిలో ఈ వానకాలం సాగునీరు సక్రమంగా అందుతుందా లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల నాగార్జునసాగర్ డ్యామ్‌కు వరద రాకపోవడంతో సాగునీరు విడుదల చేయలేదు. ఈ క్రమంలో పంట కాల్వలు, షట్టర్లు అధ్వానంగా తయారై సాగు భూములకు నీరు అందే పరిస్థితి లేకుండా పోయింది. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కింద ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో ఉన్న 41 ఎత్తిపోతల పథకాల కింద 90,912 ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగవుతున్నాయి. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గత యాసంగిలో ఖమ్మం జిల్లాకు తాగునీటి పేరుతో ఎడమకాల్వకు నీరు వదిలారు. ఈ సమయంలో 41 ఎత్తిపోతల పథకాలకు లిఫ్టు మోటార్లను పోలీసు బందోబస్తు పెట్టి బంద్ చేయించారు. దాంతో రైతులు బోరుబావుల ఆధారంతో చేసిన పంటలు సైతం ఎండిపోయి రైతులు ఇబ్బందులకు గురయ్యారు. కాగా ప్రస్తుతం వానకాలం సీజన్ ప్రారంభమైంది. ఈ ఏడాది సాగర్ డ్యామ్ నిండితే లిఫ్టులకు నీరు అందించాల్సి ఉంది. ఈ క్రమంలో ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన లిఫ్ట్ మోటార్లు పంట కాల్వలు, షట్టర్లకు మరమ్మతులు చేస్తేనే రైతులకు ప్రయోజనం కలుగుతుంది.

### కట్టలు బలోపేతం చేస్తేనే..

41 లిఫ్టుల పరిధిలో పంట కాల్వలు శిథిలావస్థకు చేరాయి. పంట కాల్వలు వెంట పూడిక తీయించడంతోపాటు బలహీనంగా ఉన్న చోట మట్టి పోసి బలోపేతం చేయాల్సి ఉంటుంది. కానీ గతేడాదిగా మరమ్మతులు చేయకపోవడం వల్ల కాల్వలు బలహీనంగా మారాయి. మోటార్ల ద్వారా పూర్తి స్థాయిలో నీరు వదిలితే గండ్లు పడి సాగునీరు అంతా వృథాగా పోయే పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లిఫ్టుల ప్రధాన కాల్వల్లో కంపచెట్లు మొలిచి వ్యర్థాలు నిండిపోవడంతో సాగునీరు అందే పరిస్థితి లేదని, వెంటనే అధికారులు కాల్వల్లో కంపచెట్లను తొలగించి కట్టలు బలోపేతం చేస్తేనే ఈ వానకాలం సాగుకు నీరు అందుతుందని రైతులు కోరుతున్నారు. అదేవిధంగా ఎత్తిపోతల పథకాల ద్వారా నీరు ఎత్తిపోసే రిజర్వాయర్ వద్ద షట్టర్లు లేకపోవడంతో నీరు భారీగా వృథా అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వేములపల్లి మండల పరిధిలో అధ్వానంగా ఉన్న ఎల్-17 లిఫ్టు కాల్వలు



### కాల్వల్లో పూడికలు తీయాలి




ప్రస్తుతం వానకాలం సీజన్ మొదలవుతుండడంతో రైతులు దుక్కులను దున్ని సేద్యానికి తయారవుతున్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం లిఫ్టు కాల్వల్లో పూడికలు తీయకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కర్ణాటకలో వర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్టులు నిండే అవకాశం ఉంది. వాతావరణ శాఖ కూడా ముందస్తు వర్షాలు పడ్తాయని చెబుతున్నది. లిఫ్టులకు మరమ్మతులు చేయాలి. కాల్వల్లో పూడిక తీయాలి.

*–బంటు యాదగిరి, రైతు, వేములపల్లి*




## చేనేత సమస్యలను పరిష్కరించాలి

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి చేనేత నాయకుల వినతి



రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న చేనేత నాయకులు

భూదాన్‌పోచంపల్లి, జూన్ 11 : చేనేత సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పోచంపల్లి చేనేత సహకార సంఘం నాయకులు, కార్మికుల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డిని మంగళవారం హైదరాబాదులో కలిసి వినతిపత్రం అందజేశారు. చేనేత సహకార సంఘంలో రూ.1.50 కోట్ల విలువైన వస్త్ర నిల్వలు పేరుకుపోయాయని, వాటిని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గత నవంబర్‌లో టెస్కో నుంచి రావాల్సిన 20 లక్షల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, సంఘం సభ్యులకు పని కల్పించాలని, ప్రభుత్వ నుంచి సంఘానికి రావాల్సిన రిబేట్ డబ్బులు 73 లక్షలను వెంటనే విడుదల చేయించాలని కోరారు. చేనేత సంఘాలకు పావలా వడ్డీపై రాష్ట్ర ప్రభుత్వం క్యాష్ క్రెడిట్ రుణాలను డీసీసీబీ ద్వారా ఇప్పించాలని, 40శాతం యారన్ సబ్సిడీని చేనేత కార్మికులకు నేరుగా అందజేయాలని, జియో ట్యాగింగ్ కలిగిన వారికి నెలకు 2,500 ఇవ్వాలని, జీవిత బీమా 5 లక్షలకు వర్తింపజేయాలని, బతుకమ్మ చీరలను రాష్ట్ర వ్యాప్తంగా చేనేత కార్మికుల ద్వారా ఉత్పత్తి చేయించాలని కోరారు. కార్యక్రమంలో చేనేత నాయకులు ఏలె భిక్షపతి, గంజి బసవలింగం, గంజి కృష్ణ, తుమ్మ లక్ష్మీనారాయణ, వర్కాల వెంకటేశం, కూరపాటి వెంకటేశం, కార్మికులు పాల్గొన్నారు.

### అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా

చౌటుప్పల్ : చౌటుప్పల్ చేనేత సహకార సంఘంలో జరుగుతున్న అవినీతిపై మంగళవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. చేనేత కార్మికులకు చేతినిండా పని కల్పించకుండా తెలిసిన వారికే పాలకవర్గం ఆర్డర్ పత్రాలు ఇస్తున్నారని కార్మికులు ఆరోపించారు. ధర్నాలో గోశిక స్వామి, గుర్రం నర్సింహ, గోశిక భిక్షపతి, గోశిక రవి, కర్నాటి జనార్దన్, జెల్ల సుదర్శన్ పాల్గొన్నారు.

## మోత్కూరు ఎఫ్‌సీఎస్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

మోత్కూరు, జూన్ 11 : మోత్కూరు రైతు సేవా సహకార సంఘం చైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డిపై అవిశ్వాస తీర్మానం నెగ్గింది. మంగళవారం స్థానిక సంఘం కార్యాలయంలో డీసీఓ ప్రవీణ్‌కుమార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పాలకవర్గం సమావేశాలకు హాజరు కాని ఇద్దరు సభ్యులు అవిశ్వాసంలో పాల్గొనేందుకు అర్హత కోల్పోయారంటూ చైర్మన్ అశోక్‌రెడ్డి సహకార చట్టం 21(బి) ప్రకారం సహకార ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి స్టేను తీసుకొచ్చారు. ట్రిబ్యునల్ ఉత్తర్వులను పరిగణలోకి తీసుకోకుండా డీసీఓ అధికార పార్టీ ఒత్తిడి మేరకు తూతూ మంత్రంగా సమావేశం నిర్వహించారు. దీనిపై చైర్మన్ అశోక్‌రెడ్డి ట్రిబ్యునల్ ఆదేశాలను పరిగణలోకి తీసుకోవాలని, ఈ నెల 18 వరకు అవిశ్వాసాన్ని వాయిదా వేయాలని వాగ్వాదం చేశారు. ట్రిబ్యునల్‌ను ధిక్కరించిన డీసీఓ సంఘం వైస్ చైర్మన్ పేలపుడి వెంకటేశ్వర్లు, మరో 8 మంది పాలకవర్గం సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించినట్లు సంతకాలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా కార్యాలయం వద్ద బీఆర్‌ఎస్, కాంగ్రెస్ వర్గీయుల మధ్య ఉత్కంఠ నెలకొంది.

### అరాచకపు అవిశ్వాసం చెల్లదు: అశోక్‌రెడ్డి

కాంగ్రెస్ అధికార దాహంతో తనపై అరాచకపు అవిశ్వాసం పెట్టిందని, అది చెల్లదని సంఘం చైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డి అన్నారు. సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అరాచకాన్ని సృష్టించి నిబంధనలు పాటించకుండా అవిశ్వాసం నెగ్గినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు.

## 15న ఎంజీయూ పీహెచ్‌డీ ఎంట్రెన్స్

- వర్సిటీ వెబ్‌సైట్‌లో అభ్యర్థుల హాల్ టికెట్స్

రామగిరి, జూన్ 11: మహాత్మాగాంధీ యూనివర్సిటీలో పరిశోధనలకు అవకాశం కల్పించే వివిధ సబ్జెక్టుల్లో చేరడానికి పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్ ఈ నెల 15న నిర్వహిస్తున్నట్లు వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆకుల రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో వెల్లడించిన నోటిఫికేషన్స్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసిన అభ్యర్థులకు మాత్రమే పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. హాల్ టికెట్స్‌ను www.mguniversity.ac.inలో డౌన్‌లోడ్ చేసుకోవాలని, అభ్యర్థులందరికీ వర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్స్ కళాశాల పరీక్ష కేంద్రంగా ఉంటుందని తెలిపారు.

### పరీక్షలు ఇలా..

- ఉదయం 10:30 నుంచి 11:30 గంటల వరకు పేపర్ -1 (రిసెర్చ్ మెథడాలజీ)
- సెషన్స్ -2లో మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు బిజినెస్ మేనేజ్‌మెంట్, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ
- మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు బయోకెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేటిక్స్, కామర్స్
- మధ్యాహ్నం 3:30 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు - గణితం పరీక్షలు వేర్వేరుగా..

### అభ్యర్థులు ఇవి గమనించాలి

ఓఎంఆర్ విధానంలో పరీక్ష ఉంటుంది. హాల్ టికెట్, ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు, బ్లూ లేదా బ్లాక్ పాయింట్ పెన్ను తీసుకురావాలి. ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. పరీక్ష నిర్ణీత సమయం కంటే 30 నిమిషాల ముందుగానే కేంద్రానికి చేరుకోవాలి.

## టీఎస్ ఎడ్‌సెట్ ఫలితాలు విడుదల

- రాష్ట్ర వ్యాప్తంగా 28,549 మంది ఉత్తీర్ణత

రామగిరి, జూన్ 11: రెండేండ్ల బీఈడీ కోర్సులో ప్రవేశానికి మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన టీఎస్ ఎడ్‌సెట్-2024 ఫలితాలను మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలిలో విడుదల చేశారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రి, ఎంజీయూ ఇన్‌చార్జి వీసీ నవీన్‌మిట్టల్, టీఎస్ ఎడ్‌సెట్ కన్వీనర్ మృణాళిని, కోఆర్డినేటర్, ఎన్‌సీటీఈ సభ్యులు పారేపల్లి శంకర్, ఎంజీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అల్వాల రవితోపాటు పలువురు అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### 96.90 శాతం ఉత్తీర్ణత

టీఎస్ ఎడ్‌సెట్‌కు రాష్ట్ర వ్యాప్తంగా 33,879 (5,732 పురుషులు, 28,147 మహిళలు) దరఖాస్తు చేశారు. వీరిలో 29,463 మంది అభ్యర్థులు (4,830 పురుషులు, 24,633 మంది మహిళలు) పరీక్ష రాయగా 28,549మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత సాధించిన వారిలో 4,769 పురుషులు, 23,780మంది మహిళలు ఉన్నారు. 96.90 ఫలితాలు వచ్చినట్లు సెట్ కన్వీనర్ మృణాళిని తెలిపారు.

### నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో 97 శాతం..

నల్లగొండ జిల్లాలో 331 మంది పరీక్ష రాయగా 323 (97.58శాతం) ఉత్తీర్ణత సాధించారు. సూర్యాపేట, కోదాడలో 667 మంది పరీక్షలు రాయగా 652 మంది (97.95శాతం) ఉత్తీర్ణత సాధించారు.

